## క్లుప్తంగా

### కరెన్సీ నోట్లతో కన్యకాపరమేశ్వరి అలంకరణ



కరెన్సీ నోట్లతో దర్శనమిచ్చిన కన్యకాపరమేశ్వరి

యానాం: మూడో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని కోరంగి నదీతీరంలో కొలువైన వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవిని కరెన్సీ నోట్లతో అలంకరించడంతో శుక్రవారం దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారికి భక్తులు విశేషపూజలు నిర్వహించారు. కుంకుమార్చనలు తదితర పూజలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

### రేపు బాలకృష్ణుని వేషధారణ పోటీలు

అమలాపురం టౌన్: సంస్కార భారతి జిల్లా శాఖ శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఈనెల 25న అమలాపురంలో చిన్నారులకు బాల గోకులం కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పట్టణంలోని గారపాటి వారి వీధిలోని గీతా విద్యాలయం ప్రాంగణంలో బాల గోకులం కార్యక్రమాన్ని 25వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు సంస్కార భారతి జిల్లా కార్యదర్శి పుత్సా కృష్ణ కామేశ్వర్ తెలిపారు. బాల కృష్ణుని పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. తమ పిల్లలను బాల కృష్ణునిగా తీర్చిదిద్ది పోటీలకు తీసుకుని రావాలని తల్లిదండ్రులకు సూచించారు. జిల్లాలోని ఏ ప్రాంతం నుంచైన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు. అయిదు సంవత్సరాల లోపు బాల బాలికలు మాత్రమే ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. పోటీలనంతరం విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అక్కడే అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 9492384665 ఫోన్ నంబరులో సంప్రదించాలని కృష్ణ కామేశ్వర్ విజ్ఞప్తి చేశారు.

### విద్యుత్ ప్రైవేటీకరణపై సమావేశం రద్దు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా విద్యుత్ ప్రైవేటీకరణ పురోగతిపై కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించాల్సిన సమీక్ష సమావేశం రద్దయింది. ప్రైవేటీకరణలో భాగంగా విద్యుత్ పంపిణీ, రివేంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్‌డీఎస్ఎస్)పై సమావేశాన్ని నిర్వహించాల్సి వుంది. అయితే అనుకున్న ప్రకారం సమీక్ష సమావేశం జరుగకుండా రద్దయినట్లు ప్రకటించారు. మరో పక్క కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(మార్క్సిస్టు) విద్యుత్ ప్రైవేటీకరణణ నిరసిస్తూ స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ వీధిలో మానవహారాన్ని నిర్వహించారు.

### జీజీహెచ్‌లో మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

యానాం: యానాం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ శుక్రవారం ముఖ్యమంత్రి రంగసామికి లేఖ రాసినట్లు యానాం సివిల్ రైట్స్ సొసైటీ అధ్యక్షుడు పానుగుమట్ల విష్ణుమూర్తి ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రిలో ఓపీడీ స్లిప్‌ను కంప్యూటర్ ద్వారా కాకుండా మాన్యువల్‌గా ఇస్తున్నారని, అదే విధంగా ఓపీడీ రిజిస్ట్రేషన్ కోసం వృద్ధులకు ప్రత్యేకంగా క్యూ, ఫార్మసీ వద్ద మందులు తీసుకునేందుకు ఏర్పాటు చేయాలని కోరారు. మెడిసిన్ పట్టుకెళ్లేందుకు పేపర్‌బ్యాగ్స్ ఇవ్వాలని కోరారు. డెంటల్ డాక్టర్‌ను నియమించి ఆధునిక డెంటల్ పరికరాలను ఏర్పాటు చేయాలని కోరారు. కాంట్రాక్టు వైద్యులే ఎక్కువగా ఉన్నారని పూర్తి సమయం ఉండేలా శాశ్వత ప్రాతిపదికన వైద్యులను నియమించాలని, ల్యాబ్‌ను ఆధునీకరించాలని, పాత ఎక్స్‌రే మెషీన్ స్థానంలో డిజిటల్ ఎక్స్‌రే మెషీన్‌ను కొనుగోలు చేయాలని కోరారు. గైనిక్ విభాగాన్ని మరింత ఆధునీకరించి కాకినాడ వెళ్లకుండా ఇక్కడే ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని లేఖలో పేర్కొన్నారు.

### నేలకొరిగిన రావిచెట్టు



భారీ వర్షానికి పడిపోయిన రావి చెట్టు

అమలాపురం రూరల్: మండలంలో చిందాడగరువు ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న వందేళ్ల చరిత్ర కలిగిన మహావృక్షం (రావి చెట్టు) శుక్రవారం కురిసిన భారీ వర్షానికి నేలకొరిగింది. సెంటిమెంట్‌గా భావించే రావిచెట్టు కూలిపోవడంతో గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుకు అడ్డంగా రావి చెట్టు పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దాంతో సర్పంచ్ పానకల గణేష్ ఆధ్వర్యాన జేసీబీ సహాయంతో చెట్టును తొలగించారు.

### 28న వాహనాల వేలం

తాళ్లరేవు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తాళ్లరేవు స్టేషన్ పరిధిలో పలు ఎక్సైజ్ నేరాలకు సంబంధించి పట్టుబడిన వాహనాలను ఈ నెల 28న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు స్టేషన్ ఎస్సై టి.చిట్టిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎ.శ్రీరంగం దొర ఆధ్వర్యంలో 28వ తేదీ ఉదయం 11 గంటలకు సామర్లకోటలోని ఐఎంఎల్ డిపో ఆవరణలో వేలం వేయడం జరుగుతుందన్నారు. వాహనాలను వేలంలో పాడుకున్నవారు పాడుకున్న మొత్తంతో పాటు జీఎస్టీ కూడా అక్కడే చెల్లించి వాహనాలను తీసుకువెళ్లాలని చిట్టిబాబు తెలిపారు.

---

### వైద్యులకు రక్షణ అవసరం

ప్రాణాలకు తెగించి వైద్యం చేస్తున్న వైద్యులకు, రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించే స్టాఫ్ నర్సులకు రక్షణ చాలా అవసరం. చాలాచోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్షణ ఏర్పాట్లు లేవు. నైట్ వాచ్‌మన్ అందుబాటు ఉంటే రాత్రి సమయాల్లో విధులు నిర్వర్తించే నర్సులకు భరోసా ఉండడమే కాకుండా విధులు ధైర్యంగా చేయగలం. నైట్ వాచ్‌మన్ లేనిచోట విధులు చేయాలంటే వైద్య సిబ్బందికి ఇబ్బందకరమే. ఒక్కోసారి రోగుల బంధువుల నుంచి ఇబ్బంది తలెత్తుతోంది. అటువంటి సమయాల్లో సిబ్బంది ఉంటే ధైరంగా ఉంటుంది. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా వైద్య సేవలు అందించాం. అవసరాలకు తగ్గట్టుగా సిబ్బందిని ఏర్పాటు చేయాలి.

– సుమ, వైద్యురాలు, గోడిలంక పీహెచ్‌సీ, అల్లవరం మండలం



### కఠిన చట్టాలు తీసుకురావాలి



మహిళా వైద్యులు, నర్సుల పట్ల దురుసుగా ప్రవర్తించే వారిని కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వాలు కొత్త చట్టాలు తీసుకురావాలి. వైద్యులు, సిబ్బందిపై దాడులు పెరిగిపోవడంతో విధులు నిర్వర్తించేందుకు భయపడాల్సిన పరిస్థితి వస్తోంది. ఆసుపత్రుల వద్ద రాత్రి సమయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది భద్రత కోసం ప్రత్యేక సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలి. వైద్యులు, సిబ్బంది ప్రజలకు పగలు, రాత్రి అనే తేడా లేకుండా సేవలు అందిస్తున్నారు. వీరి భద్రత కోసం కొత్త చట్టాలు తీసుకురావాలి:

– ఎం.కల్యాణి, స్టాఫ్ నర్సు, పేరూరు పీహెచ్‌సీ

# ఇంటి వంటకు తప్పని తంటా..

- ప్రతి రెండు వారాలకూ పెరుగుతున్న ధరలు
- పేద, మధ్య తరగతిపై భారం



నిత్యావసర సరకులు



కూరగాయలు

అమలాపురం రూరల్: నిత్యావసరాల ధరలు పెరిగిపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల నుంచి ధరలు పైపైకి పెరగడంతో నియోజకవర్గంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అమలాపురం పట్టణ, రూరల్, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లో ధరల నియంత్రణపై ప్రభుత్వం అధికారులు శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కేంద్రంతో పాటు, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ధరలకు కళ్లెం వేయడంలో విఫలమైందని ప్రజలు పెదవి విరుస్తున్నారు. పేద, మధ్య తరగతి వర్గాలపై ఆర్థికంగా పెనుభారం పడుతోంది. రెండు వారాలకోసారి మార్కెట్ నిత్యావసరాల ధరలు పెరుగుతుండంతో సామాన్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే ధరలు అదుపు చేస్తామని కూటమి అగ్రనేతల మాటలను జనం గుర్తు చేసుకుంటున్నారు.

**సరకులు కొంటే జేబు ఖాళీ..**

మార్కెట్లో పప్పు, ఉప్పు, దగ్గర నుంచి వంట గదిలో అవసరమయ్యే నిత్యావసరాల ధరలన్నీ కొండెక్కి కూర్చున్నాయి. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో బియ్యం, కందిపప్పు కౌంటర్లు అమలాపురంలో ఏర్పాటు చేస్తామని అధికారులు ఇచ్చిన హామీలు అమల్లోకి రాలేదు. మార్కెట్‌లో జేబు నిండా డబ్బులు తీసుకెళ్లినా సంచి నిండా సరకులు రావడం లేదన్నది మధ్య తరగతి ప్రజల ఆవేదన. ఐదుగురు వ్యక్తులున్న కుటుంబంలో గత నెలలో దాదాపు రూ.ఐదు వేలతో నిత్యావసరాలు రాగా, ఈ నెలలో అదనంగా మరో రూ.వెయ్యి కలిపి రూ.ఆరు వేలు ఖర్చు పెట్టాల్సి వస్తోందంటున్నారు. బియ్యం మినహా నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. 15 రోజుల వ్యవధిలో ప్రతి వస్తువు ధర అమాంతం పెరిగిపోయింది. రోజూ అవసరమయ్యే కందిపప్పు, శనగపప్పు, ఉప్పు, చింతపండు, బెల్లం, పంచదార, నూనెలు ఇతర వస్తువుల ధరలు పోటాపోటీగా పెరుగుతుండటంపై సర్వత్రా ఆందోళన నెలకొంది.

**ధరల పెరుగుదల ఇలా..**

నెలరోజుల క్రితం కిలో ధర శనగపప్పు రూ.65 ఉంటే రూ.96కు పెరిగింది. కందిపప్పు రూ.160 ఉంటే రూ.180కు పెరిగింది. వేరుశనగలు రూ.100 నుంచి రూ.130 పెరిగింది. ఎండుమిర్చి రూ.190 నుంచి రూ.220కు పెరిగింది. మినపగుళ్లు రూ.120 నుంచి రూ.140కు పెరిగింది. ధనియాలు రూ.200 నుంచి రూ.230కి పెరిగింది. బెల్లం రూ.45 నుంచి రూ.50 పెరిగింది. పంచదార 44 నుంచి 50 వెల్లుల్లి రూ.240 నుంచి 320కి పెరిగింది. ఇలా అన్ని సరకులు పెరిగిపోవడంతో జనం ఇబ్బందులు తప్పడం లేదు.

**నిత్యావసరాల ధరలు తగ్గించాలి**



గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పెరుగుతున్న ధరలను ప్రభుత్వ యంత్రాంగం నియంత్రించాలి. ధరల పెంపుపై అధికారుల నియంత్రణ పోయింది. అధికారులు తనిఖీలు నిర్వహించి పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో నిత్యావసర వస్తువులు ఉంచాలి. ప్రతి రేషన్ షాపులో కార్డుతో సంబంధం లేకుండా నిత్యావసర సరకులు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– కారెం వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అమలాపురం

**ధరలు నియంత్రించని అధికారులు**

మార్కెట్‌ను శాసిస్తున్న కొందరు వ్యాపారులు సమయం చూసి ధరలు పెంచుతున్నారు. గడిచిన రెండు నెలల వ్యవధిలో నిత్యావసరాల ధరలు పైపైకి పెరుగుతూ వెళ్లడమే అందుకు నిదర్శనం. కృత్రిమ కొరతను నిరోధించి ధరలను అదుపు చేయాల్సిన వాణిజ్య, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ, మార్కెటింగ్, తూనికలు కొలతల శాఖ అధికారులు మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే అదనుగా కొంతమంది బడా వ్యాపారులు నిత్యావసరాల ధరలు పెంచి, పేద, మధ్య తరగతి ప్రజలపై పెనుభారాన్ని మోపుతున్నారు. శ్రావణమాసం, పండగ సీజన్ కావడంతో ధరలు పెరిగిపోతున్నాయని ప్రజలు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి ధరలను నియంత్రించాలని, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. నిత్యావసర వస్తువులు ధరలతో పాటు కూరగాయలు ధరలు పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

### టంగుటూరికి ఘన నివాళి



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, అధికారులు

అమలాపురం టౌన్: ఆంధ్ర కేసరి, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి కార్యక్రమం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొని టంగుటూరి ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రానికి టంగుటూరి అందించిన సేవలను చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ సీహెచ్. నాగ సతీష్, మేనేజర్ ఎంవీఎస్ఎస్‌మూర్తి, అకౌంటెండెంట్ రామకృష్ణ, కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడు పెనుమాడి జాన్సన్ బెల్లీతో పాటు మున్సిపల్ ఏఈలు పాల్గొన్నారు.

### ప్రకాశం పంతులుకు కలెక్టర్ నివాళి

అమలాపురం రూరల్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లో ప్రకాశం పంతులు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అంతరిక్ష ప్రయోగాలకు వేదిక భారత్




అమలాపురంలో జరిగిన కోనసీమ సైన్స్ పరిషత్ మహా సభలో అంతరిక్ష ప్రయోగాల గురించి వివరిస్తున్న సైన్స్ రచయిత డాక్టర్ సర్వేశ్వరశర్మ



జాతీయ అంతరిక్ష దినోత్సవంలో అధికారులు, విద్యార్థులతో కలసి పాల్గొన్న మాజీ ఇస్రో శాస్త్రవేత్త శివప్రసాద్

అమలాపురం టౌన్: అంతరిక్ష ప్రయోగాలకు వేదిక మన భారతదేశమని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు, సైన్స్ రచయిత డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం జరిగిన కోనసీమ సైన్స్ పరిషత్ 2,880వ మహా సభలో డాక్టర్ సర్వేశ్వరశర్మ ప్రసంగించి విద్యార్థులకు అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన కల్పించారు. చంద్రయాన్-3 చంద్ర యాత్ర ఫలితంగా ల్యాండర్ విక్రమ్ చంద్రుని దక్షిణ ధ్రువం సమీపంలో గత సంవత్సరం ఆగస్టు 23న సురక్షితంగా దిగిందని గుర్తు చేశారు. ఇది దిగిన ప్రదేశానికి 'శివ శక్తి' అని నామకరణం చేశారన్నారు. ఈ ప్రయోగ విజయంతో భారత దేశానికి పేరు ప్రతిష్టలు లభించిందని వివరించారు. అందుకే ఈ రోజును జాతీయ అంతరిక్ష దినంగా ప్రకటించారని తెలిపారు. జాతీయ అంతరిక్ష తొలి దినోత్సవాన్ని నిర్వహించుకోవడంలో చాలా ఆనందంగా ఉందని డాక్టర్ సర్వేశ్వరశర్మ అన్నారు. పాఠశాల సీనియర్ సైన్స్ ఉపాధ్యాయుడు ఎం.వెంకటేశ్వరావుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కవల కోటిలింగం అధ్యక్షతన సాయంత్రం జరిగిన కోనసీమ సైన్స్ పరిషత్ మరో మహా సభలో డాక్టర్ సర్వేశ్వరశర్మ అంతరిక్ష ప్రయోగాలు, వాటి ఫలితాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ మేధాశక్తిని పరిశోధనల వైపు మళ్లించి సైన్స్ పరంగా సరికొత్త అన్వేషణలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

**అంతరిక్షయానంలో ప్రపంచదేశాల ప్రశంసలు**

అమలాపురం రూరల్: చంద్రయాన్-3 ప్రయోగంతో భారతదేశం అంతరిక్షయానంలో ప్రపంచ దేశాల ప్రశంసలు అందుకుందని మాజీ ఇస్రో శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జాతీయ అంతరిక్ష దినోత్సవం 2024 పురస్కరించుకుని జిల్లా స్థాయిలో వన్నెచింతలపూడి జెడ్పీ పాఠశాలలో శుక్రవారం అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. శివప్రసాద్ మాట్లాడుతూ పరిశోధనా రంగంలో అంతరిక్ష యాత్రలోని పాత్ర, అంతరిక్ష ప్రయాణంలో ఎదుర్కొనే సమస్యలు, విజయాలు వంటి అంశాలపై విద్యార్థులతో వర్క్‌షాప్ నిర్వహించారు. 'భారతదేశం అంతరిక్ష యాత్ర-ప్రపంచ అభివృద్ధికి మన పాత్ర' అనే అంశంపై క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ దంపతులను సత్కరించారు. సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏపీవో ఎంఏకే బీమారావు, ఐఈఆర్‌టీ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, డీఎస్ఓ జి.సుబ్రహ్మణ్యం హెచ్ఎం జి.నాగ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాలను చేస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వందలాది మంది మహిళలు స్వామి సన్నిధిలో సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాలు ఆచరించారు. దేవస్థానం అర్చక స్వాముల పర్యవేక్షణలో జరిగిన ఈ వ్రతాల నిర్వహణ నిమిత్తం మహిళలకు దేవస్థానం రూపు, రవిక, పూజా సామగ్రి సమకూర్చింది. దేవస్థానం ఈవో దూనబోయిన సాయిబాబు ఆధ్వర్యంలో సామూహిక వ్రతాల క్రతువు సాగింది. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి కూడా ఈ వ్రతాల వద్దకు వచ్చి వరలక్ష్మీదేవికి చీర, రవిక సమర్పించారు. అమ్మవారికి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని స్థానిక సుబ్బాలమ్మ ఆలయం వద్ద సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. వ్రతాలను ఆచరించిన మహిళలకు నిర్వాహకులు వెండి రూపులు, పూజా సామగ్రి సమకూర్చారు. అర్చకుల పర్యవేక్షణలో వ్రతాలను మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

**పాతకోరంగిలో..**

తాళ్లరేవు: పవిత్ర శ్రావణ శుక్రవారం సందర్భంగా కోరంగి పంచాయతీ పాతకోరంగి గ్రామంలోని పురాతన శివాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తి శ్రద్ధలతో ఆచరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కొత్తలంక రామకృష్ణ సాయిప్రసాద్ నేతృత్వంలో బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ కురంగేశ్వరస్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలతో సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలను చేసారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజా సామగ్రిని ఉచితంగా అందజేశారు. అనంతరం భారీ అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో మల్లిబాబు స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఉపాధి పనులతో గ్రామాల అభివృద్ధి



మురమళ్ల గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే గంటి హరీష్, దాట్ల సుబ్బరాజు




అనాతవరం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ కోలా గంగాభవాని




ఎ.వేమవరప్పాడులో గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్: గ్రామాల్లో జరిగే ఉపాధి హామీ పథకంలో పని దినాలను అత్యధికంగా కల్పించి గ్రామాలను అభివృద్ధి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సూచించారు. శుక్రవారం ఎ.వేమవరప్పాడు, నల్లమిల్లి గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో ఎమ్మెల్యే ఆనందరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, సర్పంచ్‌లు పందిరి విజయ, గోకరకొండ వాసు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు లింగోలు పండు పాల్గొన్నారు. 22 గ్రామాల్లో గ్రామ సభలు పూర్తి చేశామని ఏపీవో శివకుమారి తెలిపారు.

**గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనులు చేయాలి**

తాళ్లరేవు: ఉపాధి హామీ పథకం కింద ప్రజోపయోగమైన పనులు, గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనులు చేయాలని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. శుక్రవారం అన్ని గ్రామ పంచాయతీల్లో ఆయా సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. పటవల పంచాయతీలో జరిగిన గ్రామసభకు ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి పనులను ఎంపిక చేయాలన్నారు. అలాగే కూలీలకు వంద రోజులు పని కల్పించడంతో పాటు వారికి అవసరమైన సౌకర్యాలన్నింటినీ కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామసభల్లో గ్రామాల్లో చేపట్టవలసిన పనులకు సంబంధించి చర్చించారు. ప్రజలు తమకు అవసరమైన పనులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా పంచాయతీలలో నెలకొన్న పలు సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఉపాధి కూలీలకు సంబంధించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రజా సంఘాల నాయకుడు టి.ఈశ్వరరావు ఎంపీడీఓ ఎం.అనుపమకు అందజేశారు. కార్యక్రమాల్లో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావు, ఈవోపీఆర్డీ ఎం.భైరవమూర్తి, డీటీ టి.సూరిబాబు పలువురు ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**గ్రామాల అభివృద్ధికి కలసి కట్టుగా పనిచేయాలి**

ముమ్మిడివరం: గ్రామాల అభివృద్ధికి పార్టీలకతీతంగా అందరూ కలసికట్టుగా పని చేయాలని ముమ్మిడివరం ఎంపీపీ కోలా గంగా భవాని సూచించారు. మడలంలో అనాతవరం గ్రామ పంచాయతీలో సర్పంచ్ మిమ్మర్తి చిరంజీవి అధ్యక్షతన ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభ జరిగింది. ఈ సభలో ఎంపీపీ కోలా గంగాభవానీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సహకారంతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా పనులు చేపట్టాలని ఆమె సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, కోలా బాబ్జి, గ్రామ ప్రత్యేకాధికారి మండల ఏవో పి.ప్రశాంతకుమార్, ఏపీఓ డి.వెంకటేశ్వరరావు, కురసాల శివబాబు, పంచాయతీ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**తూతూమంత్రంగా గ్రామ సభలు**

ఉప్పలగుప్తం: ప్రభుత్వం గ్రామాల్లో ఉపాధి గ్రామ సభలను నిర్వహించి ప్రతి గ్రామంలోనూ అవసరమైన 266 పనులను ఏర్పాటు చేసేలా గ్రామస్తులతో గ్రామ సభలు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మండల వ్యాప్తంగా ఉన్న 17 పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించే సమయంలో అధికారులు నిర్లక్ష్యం వహించి కొన్ని పంచాయతీల్లో శుక్రవారం తూతూమంత్రంగా గ్రామ సభలను జరిపారు. గ్రామంలో ప్రతి పౌరునికి దండోరా వేయించి సమాచారం ఇవ్వాల్సిన అధికారులు గ్రామ పౌరులకు ఎటువంటి సమాచారం తెలియనివ్వకుండా కొంత మంది కూటమి నాయకులు, సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధి కూలీలను పెట్టి గ్రామసభ ముగించారని మండలంలో పలు ప్రాంతాల్లో ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో సమస్యలను గుర్తించాలని గ్రామసభలను నిర్వహిస్తే కొంత మంది అధికారులు గ్రామంలో ముఖ్య నాయకులు గుర్తించిన పనులకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వటం ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు.

**పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తాం**

ఐ.పోలవరం: పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తామని ఎంపీ గంటి హరీష్‌మాథుర్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మురమళ్లలో జరిగిన గ్రామసభలో ప్రజలకు హామీ ఇచ్చారు. స్థానిక మురమళ్లలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గతంలో నియోజకవర్గంలో ఉపాధి నిధులతో మ్యాచింగ్ గ్రాంట్ జత చేసి నియోజకవర్గంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మించినట్టు చెప్పారు. ఇప్పుడు మళ్ళీ తిరిగి పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

### గ్రామసభల్లో రూ.4.27 కోట్లతో పనులకు అంచనాలు



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.4.27 కోట్ల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి గ్రామసభల్లో తీర్మానం చేశామని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. మండలంలో వ్యాప్తంగా ఆయా గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పనిదినాలు, స్త్రీ పురుషులకు సమాన వేతనాలు, సామాజిక తనిఖీ ప్రాముఖ్యత, సీసీ రోడ్డుల నిర్మాణాలు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల నిర్మాణాలు తదితర విషయాలపై గ్రామసభల్లో ప్రస్తావించారు. గోడి పంచాయతీలో జరిగిన గ్రామసభకు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆంధ్రకేసరి చిత్రపటానికి ఎమ్మెల్సీ నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, రాకాపు విజయలక్ష్మీ, బర్రే సీతారత్నం, రుద్రరాజు పవిత్ర, తోట శ్రీదేవి, రాయుడు విష్ణు, గుంటూరి కృష్ణంరాజు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.